81

# దేవుడు రాయని డైరీ

మధ్యాహ్నం పన్నెండు.
బైట ఎర్రగా తెల్లగా ఎండ.
ఎండలో మంటలు.
మంటల్లో ప్రపంచం—
ప్రపంచంలో మనుషులు - కోట్ల కొద్దీ మనుషులు.
మనుషుల్లో మంటలు
మంటల్లో ఎండ.
జగన్నాధం మనసులో ఎండ.
జగన్నాధం మెదళ్ళో మంటలు.
జగన్నాధం చుట్టూ మనుషులు.
కేకలు, చప్పుళ్ళు, గ్లాసులు.
"ఒరేయ్ క్లీనరూ.
"నాలుక్కాఫీ. షుగరెక్కువ—"
"ఇదేమిటన్నా మిరపకాయలు పెసరట్టులో?"
"మరీ మాడ్చకు దోశని—"
"ఏం కావాలి?"
జగన్నాధం తలెత్తాడు?
జగన్నాధం ఎప్పుడోగాని తలెత్తడు.
ఎప్పుడూ తలదించుకునే వుంటాడు.

అవసరం వస్తేగాని తలెత్తడు.

అతనెప్పుడు తలెత్తుకుందామనుకున్నా, అతనెప్పుడు సంతోషంగా వుందామనుకున్నా, అతన్ని ప్రపంచం, మనుషులూ, తలెత్తనివ్వలేదు. (సంతోషంగా) బ్రతకనివ్వలేదు.

"ఒక్కా—ఫీ!!"

ఇంకా కేకలు — అరుపులు — గోల అవసరంలేని excitement.

జగన్నాథం మనసులో excitement.

ఇంట్లో నాన్నకి బ్లడ్ ప్రెషరెక్కువైనప్పుడల్లా excitement.

ప్రపంచం నిండా excitement.

ఉద్యోగం దొరకని తనకి కాఫీకి డబ్బులేనప్పుడూ, సిగరెట్టు లేనప్పుడూ excitement.

ఆశలు కాలిపోయాక, మనసింకా కాలుతున్నప్పుడు జగన్నాథానికి excitement.

"ఇదిగో కాఫీ—"

వెచ్చని కాఫీ.

అబ్బ! వేలు చురుక్కుమంది.

ఫరవాలేదు. కాఫీ ఇలాగే ఉండాలి.

"అబ్బ కాఫీ బావుంది"

"హోయీ సర్వేశం! నీవు చాలా గొప్పవాడివోయీ!"

అన్నం పెట్టని గవర్నమెంటు కన్నా, కనిపించని దేవుడికన్నా, ఇంత చక్కని, వెచ్చని, తియ్యని, పల్చని, కాఫీ ఇచ్చిన నీ జీవితం చరితార్థమోయీ?

"కాఫీ ఐపోయింది."

"హయ్యో? సర్వేశం! నువ్విచ్చిన అమృతం ఐపోయింది"

జైపులో సంతోషమైపోయినట్టు ఐపోయింది.

వెచ్చని, తియ్యని, పల్చని కాఫీ సుఖంలాగా ఐపోయింది.

కరిగిపోయింది అయిపోయిందయ్యా ఐపోయింది.

ఇరవై పైసల బిల్లు చేతికొచ్చింది.

"ఇరవై ఇరవై—"

ఐదేళ్ళ క్రితం తనకిరవై యేళ్ళు.

అప్పుడు మెదళ్లో యిరవై కోట్ల ఆశలు— కోరికలు— నాన్నవీ, తాతవీ కలిపి ఇరవై చిరిగినకోట్లు—వాటన్నిటినీ వదిలేసి ఇరవైయేళ్ళు వెళ్ళిపోయాయి——

"ట్వెన్టీ! టూ జీరో!!"

"టూ జీరో!"

"కాదు సార్. టూ నైనొచ్చింది"

జగన్నాథం చుట్టూ చూశాడు.

అప్పుడే తనబిల్లిచ్చి పై కొచ్చేశాడు.

కిళ్లీ కొట్టు దగ్గరున్నాడు.

ప్రక్క—నెవడో అస్థిపంజరంలాగ పళ్ళిగిలిస్తున్నాడు.

"ఓ చార్మినార్?"

కొట్టువాడిచ్చాడు. ఇచ్చిన ఐదు పైసలు తీసుకొని మూడు పైసలిచ్చాడు.

"అగ్గిపెట్టిస్తారా?"

కొట్టువాడగ్గిపెట్టివ్వలేదు.

రెణ్ణిమిషాలు బేరం చూస్కొన్నాడు.

తర్వాత జగన్నాథాన్ని "ఏవోయ్ నలుసూ?" అన్నట్టు చూశాడు.

అతనన్నది విననట్టు చూశాడు.

"అగ్గిపెట్టి—

కొంచెం విసుగుతోబాటు అగ్గిపెట్టిచ్చాడు.

జగన్నాథం సిగరెట్టు ముట్టించాడు.

అగ్గిపెట్టి తిరిగిచ్చేశాడు.

కొట్టువాడి ప్రక్క— కృతజ్ఞతతో చూశాడు.

వాడు లెఖ్ఖచేయలేదు.

"హమ్మయ్య! ప్రతీదీ గండమే."

జగన్నాథం సిగరెట్టు పొగ పీల్చాడు.

బరువుగా కదిలాడు.

రోడ్డు మాడుతోంది.

జగన్నాథం మాడుతున్నాడు.

పొగవదులుతున్న జగన్నాథాని కేదో జ్ఞాపకమొచ్చింది. ఏమిటీ చెప్మా? ఏమిటి!?

"మందులు—నాన్నకి మందులు—చీరెలు-అమ్మకి చీరెలు—

పరికిణీలు—చెల్లెలికి పరికిణీలు—

పుస్తకాలు—తమ్ముడికి పుస్తకాలు— సమస్యలు- ప్రోబ్లెమ్స్—ప్రతీది ఒక ప్రోబ్లెమే.

వుద్యోగం లేని బతుకు—

అడుక్కు- తిన్డానికి కూడా పనికి రాని బియ్యే డిగ్రీ—

"హబ్బా! అన్నీ సమస్యలే!!"

పూర్ క్రీచర్! జగన్నాథమ్!! ప్రాబ్లెమ్స్!!:

Mr. Jagannadham B.A. is trapped in problems....

ప్రొద్దున్న నాన్న కోపంతో అందర్నీ తిట్టాడు.

తమ్ముడు పుస్తకాలడిగితే తిట్టాడు.

చెల్లి చిరిగిపోయిన పరికిణీతో కనబడితే తిట్టాడు.

అమ్మ బియ్యం లేదని చెబితే తిట్టాడు.

వుద్యోగం లేని తననీ, ఇవ్వని గవర్నమెంటునీ తిట్టాడు.

తెల్లవారకముందే వచ్చి పీడించుకుతిని, వెళ్ళిపోయిన బొద్దింక మీసాల ఇంటోనర్ని తిట్టాడు.

తిట్లు-ప్రోబ్లెమ్స్—

నాన్నకి బ్లడ్ప్రెషర్.

అందర్నీ తిట్టి మంచం మీద పడిపోయాడు.

"మందులు-" అంది అమ్మ.

క్రితం రోజు ఎవరో స్నేహితుడు.

ఇంకా వాడి మనస్సు బ్రతికే వుంది.

పావలా అడగ్గానే ఇప్పించాడు.

అత్తప్ప తన్దదగ్గర మరేవుంది?

"తెస్తాను" అన్నాడు. అని బయల్దేరాడు.

చెల్లి పరికిణీల కోసం, తమ్ముడి పుస్తకాల కోసం, అమ్మ పసుపు కుంకుమల కోసం తనపక్క ఆశల్ని కళ్ళలో వో ప్రక్క నింపుకొని-మరో పక్క కన్నీళ్ళని దాస్తూ చూశాడు.

తనే ఇప్పుడు వాళ్ళకి పెద్దదిక్కు.

"జ్యేష్ఠ పుత్రుడు!"

ఒక్కరి కష్టాలు తీర్చలేడు.

"జగన్నాధమా!"

"మానవాధమా!"

"అహ్హాయ్! కవిత్వం!"

తను కవిత్వం చెబుతున్నాడు

కవిత్వం—కవి-

జగన్నాథం కవి-

"అంచేత చంద్రుడికో నూలుపోగన్నట్లు, ఈ పదివేల రూపాయలపర్సుని స్వీకరించమని సుప్రసిద్ధ కవులైన శ్రీ సిరిగజ్జెల జగన్నాథం గార్ని కోరుతున్నాం"

జగన్నాథం కవులు లేచారు.
వారు వేసుకున్న సిల్కు లాల్చీ,
వారు కట్టుకున్న ఖరీదైన
నూరో నెంబరు నూలు పంచె,
వారి ముఖంలో ఆరని చిర్నవ్వు,
వారి కళ్ళలో కవుల్లో వుండే కాంతి,
వారి మెడలో మోయలేక మోస్తున్న పూలదండలు,
సభికులకు ఠీవిగా నమస్కరించేరు.
వుద్రేకంగా మాట్లాడేరు.
గేయాలు చదివేరు-
హర్షధ్వానులు—చప్పట్లు-
బ్రహ్మారథం!

జగన్నాథం-
లక్షలకొద్దీ ప్రేక్షకులు-
ఆటోగ్రాఫులు-
జగన్నాథ కవి చక్రవర్తి-
"హబ్బా! వేలు కాలింది"
సిగరెట్టు నిద్దర్లేపింది-
పన్నెండున్నరైంది-
మెయిన్రోడ్ కాల్తూమెరుస్తోంది-
తారంతా కరిగిపోతోంది-
చిరిగిన చెప్పులకంటుకుంటోంది.
"మై గుడ్నెస్! ఎండ
ఆఁ ఏదో - ఏమిఁటది యేమిటి చెప్మా
"ఆకలి- ఔను ఆకలి-
ఆకలేస్తోంది. అన్నం తింపేబావుణ్ణు-
యింటికెళ్తే-
వాళ్ళకే లేంది తనకేం వుంటుంది.
"అబ్బా!"
కాలుమంట - వేలికి రక్తం-
ఎదురుగా సూదిరాయి-
మునిసిపాలిటీ వాళ్ళ ప్రతిభకు తార్కాణమా!
"హౌను కాబోలు!
కడుపుతోబాటు వేలుమంట-"
"అయ్యో! అబ్బా!
రోడ్డు నిర్జీవంగా-
నిర్జనంగా ఏడుస్తోంది-
వెయ్యి ట్యూబ్లైట్ల కాంతి-
"ఓయీ జగన్నాథమా! ఆగుము-
జగన్నాథమాగెను-

"ఇన్నాళ్ళకు నాకు శాపవిమోచనం కల్గించితివి-
ఎవరు స్వామీ మీరు?"

-నేనొక గంధర్వుడను ఇన్నాళ్లూరాయి రూపములో పడియుంటిని- ఒక పవిత్రుడూ, సత్యసంధుడూ ఐన మానవుడి కాలివేలిని చీల్చిననాడే నాకు శాపవిమోచనమగునని, భగవంతుని ఆజ్ఞ. నీవే ఆ మానవుడివి.

ఇంద, ఈ అక్షయపాత్ర గైకొనుము. సుఖముగా జీవించుము- పొమ్ము- గంధర్వుల వారంతర్ధానమైరి.

"ధన్యుడ్ని స్వామీ-"

జగన్నాథము వినమ్రుడై చేతులు జోడించెను.

పిదప చేతులు జాచెను-

"ఎంతది?"

జగన్నాథములిక్కిపడి-

ఈ ప్రపంచం లోనికి తృళ్ళిపడెను-

ఎదురుగా ఐస్ఫ్రూట్ బండివాడు-

ఐస్ఫ్రూట్ చల్లగా, తెల్లగా-

జేబులో ఎంతుంది- అర్ధణా కాబోలు-

"ఆహా యేమదృష్టం-"

-తప్పుతప్పు। మూడు నయాపైసలు. వూహూఁ అదియునుంగాదు మూడుపైసలు.

"హోరీ! ప్రభుత్వపు నియమము నుల్లంఘించు చుంటివా?"

లేదుస్వామీ లేదు. ఇవి మూడు పైస—

ఓరి జగన్నాధం- నీదిరా అదృష్టం—

"ఎంత బావుందీ ఐస్ క్రీమ్. చల్లగా తెల్లగాఅందంగా—"

పదడుగుల దూరంలో

కూల్డ్రింక్షాపుదగ్గర

ఆగిందో కారు.

దిగిందో భామామణి.

తెల్లని పల్చని చీరా. గులాబిరంగామె వొంటిది.

హోయలామె వయసుది.

వెనక్కి తిరిగిందామె-
ఎర్రని జాకెట్టు—
దళసరిగా వున్నట్టుంది కాని- కాని
అదేమిటోయ్- అది-
అవేఁ విటోయ్?
"అవా! అవా??"
తెలీదూ! ఎంత అమాయకుడివయ్యా బాబు?
జానాను- తెలిసింది. బ్రాసరీలు కాబోలు.

పాములా కనిపిస్తూ, మనసుమీద పాకుతూ గిలిగింతలు పెడుతున్నాయి!

"వో నారీ రత్నమా? నవ నాగరికయుగ ప్రతినిధుల తలమానికమా! ధన్యోస్మి! నా జీవితము ధన్యము

ఈ ఎండలో—
ఈ వేడిలో—
ఐస్ఫ్రూట్ వంటి నీ చల్లని వడిలో—
వాడిలోని నీ చల్లదనములో—
నీ వొంపుల సొంపుల ఇంపులో—
"హలో! జగన్!"
"హలో!"
ప్లిమత్ కారు—
లోపల పచ్చని పల్చని చీర.
తెల్లని, వెన్నెల్లాంటి జాకట్టు—
పిలుస్తున్నకళ్ళు—
నవ్వుతున్న పెదాలు—
జాచిన చెయ్యి.
తీసిన ఫ్రంటుడోరు—
మళ్ళీరమ్మని పిలుపు—
చల్లని చిర్నవ్వు—

లోపలికి వెళ్ళిన జగన్నాధం—
పక్కన కూచొన్న అదృష్టనాశం—
బయల్దేరిన కారు—
మధ్యలో టర్నింగ్—
వాలిన భుజాలు—
ఊగిలిన పంపులు.
రేకెత్తిన కోరికలు.
కారాగింది—
'ఇదే మా మేడ—
రండి.
దయచేయండి.
టెర్లిన్‌సూట్లో మెరుస్తున్న జగన్నాధం—
లోపలికి వెళ్ళిన సిరినాదం—
ఎయిర్ కన్‌డిషన్‌డ్ గది
పలకరించిన తెల్లని వొంటిమీద ఇంకా తెల్లని బ్రాసరీస్—
సెంటువాసన
డబ్బున్న ఆడదాని వాసన
"హా మైడియర్ జగన్—"
"ఐస్ క్రీంలా చల్లని- మెల్లని ముద్దు—
"అబ్బ!"
మిగిలిన ఐస్‌క్రీం ముక్క కాలుమీద పడింది.
"జగన్నాధం"
"హారా జగన్నాధం. ఏమిటో యీ పగటి కలలు.... రివరీ!!"
"ది సీజ్ ది రివరీ ఆఫ్ పూర్ జగన్నాధమ్."
"అయ్యో! ఇలా ఎంతదూరం నడవడం?"
"ఏమో? ఎవరికి తెలుసు?"
"ఎవరికోయ్ తెలుసు?"

ఎవరికి తెలుసో ఎవరికి తెలుసు ?
కడుపులో చల్లని మంట.
ఆకలి చల్లగా, గట్టిగా ఏడుస్తోంది
"ఐస్క్రీమ్ తింటే ఆకలిపోదు—
ఎవడో తెలివైనవాడే పాడేడు
ఏ శాడు !
"ఔను, నిజమాడిన నిష్ఠురమగును"
"అరే ! పార్కు—
"అదే— పార్కు—
"అందంగా నీడగావున్న పార్కు—"
పచ్చని గడ్డి—
చక్కని చల్లదనం.
"అరే ! గేటుమూశారు—
"ఎలా ?"
ఏముంది ? గోడ గెంతవోయ్—
"భావుంది. గోడని దొంగలుమాత్రమే గెంతెదరు—"
ఔను కాబోలు— ఔనౌను—
కాదు కాబోలు— కాదాకాదు—
దొంగతనం చేయడానికి పార్కులో ఏముంటుంది ? గడ్డి తప్ప.
ప్రభుత్వం వాళ్ళు వెర్రివాళ్ళటోయ్ ! కాదామరి— కాకపోతే— ఇప్పుడు గేటు మూసేస్తే ఎలా ?
"నీ మొఖం ! అది సాయంత్రం"
అందంగా షికారు పోవడానికి—
నీలాంటి నిరుద్యోగులకనుకున్నావా ?
"అనుకున్నాను. హౌరా ! ఏమీ
దౌర్జన్యమ్ ? ఇదే గోడ గెంతుచుంటి"
హౌరా ! అంతట ఆ జగన్నాధమేమి జేసెను ?
అంతట ఆ జగన్నాదము ఆ ఒంటిగంట వేళ పార్కు గోడ గెంతెను!

Jagannadham jumped upon the wall
మరియు లోపలికి వెళ్ళెను.
వోహో ? ఏఁవిఁ చల్లదనము
సూర్యుడు కనబడుతున్నాడు కానీ ఏఁవిఁ చేయలేకపోతున్నాడు.
చల్లగా సిమెంటు బెంచీపై
కాదు- ఈ పచ్చగడ్డిపై పవ్వళించిన కష్టములు విస్మరించవచ్చును గదా!
-కష్టాలుమరంచిపోవడం ఎలాగోయ్?
"అబ్బే! ఇంపాజిబుల్-
నాన్న- అమ్మ- చెల్లీ- తమ్ముడు మందులూ, చీరలూ, పరికిణీలూ, పుస్తకాలూ డబ్బులు-తిట్లూ నోవేకెన్సీ బోర్డులూ, డబ్బున్నవాళ్ళ నవ్వులు, నీలాంటివాళ్ళ యేడుపులు, ప్రభుత్వంవారి గర్జింపులు.
ఇవన్నీ ఎలా మర్చిపోవడం? అసాధ్యం!
It is highly impossible!
ఐతే. మరేదో ఆలోచించాలి. మరేదైనా చేస్తే - అవునుమరేదో-
"యేవిఁటది- Sleep Sleep
Man, Sleep!
ఔను నిద్రపోవాలి.
"ఓ నిద్రాదేవీ! నన్నావహించి పుణ్యం కట్టుకో-
"జగన్నాధం పూర్ క్రీచర్!
మూర్ఖుడా! అసమర్థుడా-
నిద్రపో-పోపో-పోవోయ్పో పచ్చగడ్డి-
రోడ్డుమీద కురుస్తోన్న ఎండ-నాన్న మందులు, అమ్మ యేడుపులు, చెల్లి పరికిణీలు, తమ్ముడి పుస్తకాలు, ఎర్రని జాకెట్టు, ప్లిమత్ కారు, చిరిగిన చొక్కాలు- ఐస్క్రీమ్‌లూ- దేవుళ్ళ- మనిసి పాలిటీ రాళ్ళు, కవులు, కావ్యాలు.
"హాఅఅ య్యి"
ఆ ఆవలింత.
"అహా! ఏవదృష్టం!! నిద్రవస్తోంది.

ఓ ఆకలీ! ఓసీ కష్టమా, లా! ఓరి జగన్నాధమా, నిద్రపోండి, పోండి, నిద్రపోండి. పార్కులో వొంటరులై పోండు పార్కులో వొంటరులై నిద్రకువెలియై బాధపడకుడి. మీ బాధలను మర్చిపోండు. **Sleep- Sleep- Sleep.**

* * * *

గోల- కేకలు-
"ఏమిటీ గోల"
"ఏదైతేనేం? పాపం జగన్నాధం"
హల్లో, జగన్నాధం?
నిద్రలేచిపోయావా?
మర్చిపోయిన కష్టాలన్నీ పళ్ళీ,
గుర్తుకు తెచ్చుకుని, కుమిలి, ఏడ్చి,
ఏడ్చి, కుమిలి,
చావలేక బరడానికీ-
బతకలేక చావడానికీ-
చస్తూ బతుకుతూ, చచ్చినట్టు బతకటానికి-
బతుకుతూ చస్తూ, బతకలేక చావడానికి.
నిన్ను నిద్రలేపేశాయీ కేకలు.
నిన్ను నిద్రలెపేశారి జనం.
"అయ్యో! ఎంత మూర్ఖులయ్యా వాళ్ళు!-
"మోసమయ్యా వీళ్ళు చేసేది-"
రాళ్ళయ్యా వీళ్ళ మనసులు-
"ఏమిటయ్యా నువ్వు వీళ్ళకి చేసిన అపకారం-"

"ఏమీలేదు. ఐనా నిన్ను లేపేశారు వాళ్ళు. నువ్వు కాస్సేపు సుఖంగా పడుకుంటే, సహించలేని మనుషులు.

కాస్సేపు కష్టాన్ని మరిచిపోదామని నువ్వనుకుంటే మర్చిపోనివ్వ రయ్యా వాళ్ళు.

"అందుకేనయ్యా వీళ్ళ మనుషు-"
ఏవిటయ్యా వీళ్ళకీ కుళ్ళు'
నిన్నలాగైనా బతకనియ్యరేవిటి?
ఎందుకయ్యా వాళ్ళలో ఈ విషం?
నిన్నలాగైనా ధావనివ్వరేంటి?
విషం....విషం....

Man is the most poisonous creature. What do you say Mr. J. N. Tham?

"ఔనంటావా? ఔననివోయ్ జగన్నాధం-"
"ఔను"
"అదీ! అద్దదీ!"
-అలా తిట్టవోయ్ తిట్లు.
అంతే?! మరి నీకు తిట్లు రావటోయ్!
ఇంకొస్తున్న ఎండా,
వాళ్ళ కిఠలూ,
వాళ్ళ విషపు మనసులూ,

ఇవన్నీ కల్సి నీకు తిట్టడానికి, Inspiration ఇవ్వటం లేదోయ్! అయ్యో జగన్నాధం! అయ్యయ్యో గన్నాధం."

How innocent you are! You are a very innocent fellow.

నువ్వెంత వెర్రి పీనుగవోయీ ?
"మనమంతా పీనుగులం -"
ఆహా! ఎవరోయ్ ఇంతచక్కగా అన్నారు."

"ఆ!! అదీ; గోల. పక్కస్టేడియంలో మాట్లాడుతున్నాడు. ఎవడీ వెర్రిపీనుగ. యేదో మీటింగుకి రమ్మంటున్నాడు.

కాదయ్యా కాదు!
మాట్లాడుతున్నాడు.
ఎవడో పీనుగు మాట్లాడుతున్నాడు.

ఎండ తగ్గిపోతోంది. "తగ్గదూ మరి? నువ్ పడుకున్నంత మాత్రాన భూమి తిరగడం ఆగిపోతుందయ్యా మరీ!"

"యేవిఁటోయ్ మాట్లాడుతున్నాడు?"

"ఆ అర్థమైంది. యేవిఁటదంట?"

ఇదేమిటంట - హిందీ—

హిందీ రాజభాష కావాల్టోయ్ - హౌరా! హిందీ రాజభాషేవిఁటోయ్? అపకుండా ఆర్రోజులు హిందీలో అమ్మనీ, అల్నితికితే అర్థమై ఛావని వెధవ హిందీ కావాలంటున్నాడు. ఎవడయ్యావాడు?

ఎవడో మినిష్టరేమో? హిందీవస్తే ఎక్కువ డబ్బులు చేస్కొంటాడేమో? ఔనయ్యా, జగన్నాధం. నువ్వన్నది నిజమే.

పోనీవయ్యా పోనీ?

జగన్నాధం! ఈ ప్రపంచం కాలిపోనీ?

అందర్నీ ఛావనీ.

నీ కెందుకయ్యా.

నా కెందుకు? ఔన్నా కెందుకు!

నా చావేదో నేన్చస్తాను-

ఛావయ్యా చావు—

మళ్ళీ బతక్కు—

ఎలా? ఛావడం మాత్రం తేలికా. ....ఛస్తూ, ఛావలేక బతికిపోతే. చావనివ్వదుసరికదా చచ్చే చావు చావంత చవగ్గా వుందటయ్యా— లేదయ్యా లేదు. నీవన్నది నిజం- నిజం—

Jagannatham always says the truth nothing but TRUTH Only!

"అబ్బ? యేవిఁటోయ్? తలపేలిపోతోంది.

తలనొప్పంటారు దీన్ని?
తలపోటన్నా ఫరవాలేదులే?
"వోహో, అలాగా, యేఁవిటయ్యా దీనికి మందు?
కాఫీ?
ఔను కాఫీ?
కాని డబ్బులెలాగయ్యా.
డబ్బు - డబ్బు - డబ్బు—
"మనగ్గిరేన్ని—"
ఔనయ్యా? Correct! Correct!
సర్లే. కాఫీ ఎలాగ?
ఎలాగేవిఁటి?
నీ జీవితమిక అంతేనయ్యా బాబూ.
కష్టాలు తల్చుకొంటూ, ఛావలేక బతుకు.
ఇది నా శాపం?
శాపవాఁ?
ఎవరివి నువ్వు?
"నేను నీ మనసునోయ్? జగన్నాధం."
ఐతే నన్నిలా పుణ్కుతున్నావేవిటి?
"నువ్వే వుందువుగాని'"
సర్లే ఇప్పుడెలా?

"జగన్నాధమనే గ్రాడ్యుయేటు మరియు సన్నాఫ్ సి. ప్రసాదరావు, బ్రదర్ ఆఫ్ వన్ సిస్టర్ అండ్ బ్రదర్ వూరూ పేరూలేక చావలేక బతుకుతూ, డబ్బుల్లేక' నాన్ననీ, అమ్మనీ, చెల్లెల్నీ, తమ్ముణ్నీ, సుఖ పెట్టలేక, సుఖపళ్లేక – ఆలోచనల్తో కొట్టుకు పోతూ,

ఎప్పుడో అదృష్టం కాత్తే వో గుమాసాగిరీ దొరికి గొర్రెతోకలాటి జీతంతో అర్థంకాని బతుకు బతుకుతూ, ఎప్పుడో, ఎలాగో, ఎందుకో, ఎక్కడో, యేడుస్తూ ఛస్తాను.

"నిజవేఁ? అంత అదృష్టమా? ఇంతవేగం ఛావలేవోయ్ జగన్నాధం"

—అరెరె! పూర్ క్రీచర్. నిన్నెన్ని మాట్లనేశాను? బాధపడకు పడిమాత్రం యేంచేయగలవులే. పడకుండా ఎలావుండగలవు? అరరె యేడవకయ్యా.

యేడవకు యేడవకు వో జగన్నాథం యేడిస్తే నీ కళ్ళు మంటలను పెట్టు. కన్నీళ్ళు కార్చబోకోయ్ జగన్నాథం. నీళ్ళెక్కడున్నాయి రక్తాలు కారు. అందుకని—

పడుకోవయ్యా పడుకో—

ఇంకా బాధపడడమెందుకు.

ఎవరి బాధలు చూడలేవు.

తీర్చలేవు బతకలేవు? చావలేవు అందుకే పడుకో.

"పడుకుంటాను. కాని - ఇంక-

అమ్మా, నాన్నా, తమ్ముడూ చెల్లీ వీళ్ళు సుఖపడే రోజులు వస్తాయంటావా?

ఈ ప్రపంచం కాలిపోయేలోపున వాళ్ళొక్కసారన్నా మనస్ఫూర్తిగా నవ్వుతారంటావా?"

"వస్తాయయ్యా! వస్తాయి!!

కడుపునిండా తిండితిని నోటినిండా వాళ్లూ నవ్వుతారులే. నువ్వు మరి పడుకో. ఆ కల్నీ, కష్టాల్నీ, మందుల్నీ, యేడుపుల్నీ, అన్నిట్నీ మర్చిపోయి పడుకోవోయ్. పడుకో.

జగన్నాదం? జగన్నాథం??

Oh! Jagannatham?

"అబ్బ? అమ్మా? హాయ్" నిద్రలోంచి అవలింత.

చికటి మెల్లిగా దేకురుతూ వస్తూంది.

నాన్న మందులు అమ్మ కుంకం, చెల్లెలు పరికిణీలు తమ్ముడి పుస్తకాలు.

వీళ్ళందరి చావులాంటి యేడుపులూ,

శ్మశానాల్లాంటి జీవితాలూ—

—ఇవన్నీ నువ్వెన్నిసార్లు వల్లించినా ఎంత సేపాలోచించినా ఎవడూ వినడు. ఎవడూ చూడ్డు.

ఇవన్నీ మరిచిపోయి నిద్రపోవోయ్ జగన్నాథం!

ఈ మనుష్యుల అర్థంలేని కేక లేవీ లెక్కచేయలేండా హాయిగా నిద్రపో - పో !—

పార్కులో మెరుస్తున్న గడ్డి, చేయీ చేయీ కలిపి తిరుగుతున్న జంటలూ, బైట కార్లు, మెరుపు తీగలు, ట్యూబ్ లైట్లు, మోహాలు, కేకలు, అల్లర్లు, లంఢాచోరీలూ.

మనుషులు కక్కుతున్న విషాలు.

ఇంకా డబ్బున్నవాడి నవ్వు-

డబ్బులేనివాడి చావులు -

- పార్కులో జగన్నాథం నిద్ర

నాన్న మందులు, అమ్మ చీరలు, చెల్లెలి పరికిణీలు, తమ్ముడి పుస్తకాలు, కవి సన్మానాలు, ప్లిమత్ కారు, ఎర్రని జాకెట్టు, తెల్లని ఒంటి వొంపులు -

వీటన్నిట్నీ పొరకప్పేసిన నిద్ర -

Oh ! jagannatbam fall in Sleep:

జగన్నాథం నిద్రపోయాడు?

అరె - ఎన్నాళ్ళకు నిద్రపోయాడు.

* * * *

మరి కాస్సేపోయాక మెరుస్తున్న గడ్డి మీదికీ నిద్రపోతున్న జగన్నాథం మీదకీ వెన్నెల మత్తుగా జారింది.